# ఒక ఉద్యోగిని వ్యథ

అయ్యో! అప్పుడే మూడు గంటలు కొట్టేసిందా? మరో గంటలో లేస్తేగాని పన్లు తెమలవు. ఇవాళైనా కొళాయి దగ్గర ఓ బిందెడు మంచి నీళ్ళు దొరుకుతాయో లేదో తెలియదు. నిన్న నేను వెళ్ళడం కాస్త లేటయేసరికి కొళాయి దగ్గర 'క్యూ' పెరిగిపోయింది. నా దగ్గరకొచ్చే సరికి నీళ్ళు కాస్తా అయిపోయాయి.

ఆ పక్కింటి మీనాక్షి కూడా నాలాగే ఉద్యోగం చేస్తోంది. అయినా ఆమెకి అత్తగారి సాయం ఉంది. పొద్దున్నే ఆవిడ లేచి వంట అదీ చూసుకుంటుంది. వాళ్ళాయన కొళాయి దగ్గర నీళ్ళకి వచ్చి మంచి నీళ్ళు పట్టి తీసుకెళ్తాడు. కాబట్టి ఈవిడ ఏ హడావుడీ లేకుండా మెల్లిగా లేచి పిల్లల పనీ, తన పనీ చూసుకొని టైముకి బయల్దేరి ఆఫీసుకి వెళ్తుంది.

ఆ మాటే నేను మా ఆయన్తో ఓరోజు అన్నాను. 'ఆ మీనాక్షి మొగుడు చూడండి, పొద్దున్నే లేచి నీళ్ళు తెచ్చి పెడతాడు. ఆవిడకు ఆ పని లేదు' అని.

'ఇదిగో! నన్ను వీళ్ళతోనూ, వాళ్ళతోనూ పోల్చకు. నా అలవాట్లు నావి. ఆయన లక్ష రూపాయలు కట్నం తీసుకున్నాడు. నేను తీసుకున్నానా? ఒక్క పైసా తీసుకోలేదే? దానికేమంటావు?' అన్నారు.

అంటే ఆయన అభిప్రాయం కట్నం తీసుకోలేదు కాబట్టి ఇంటా బైటా ఎంత చాకిరీ అయినా నేనొక్కత్తినే నోరు మూసుకుని చెయ్యాలనేగా!

అయినా నా వెర్రిగాని - వాళ్ళంతట వాళ్ళు భార్య కష్టపడుతుందే! అనే జాలితో ప్రేమతో సాయం చెయ్యాలే గాని, అడిగి ఎంతకని చేయించుకోగలం?

'మాటకి మాట తెగులు - నీటికి నాచు తెగులు' అని మాటకి మాట అనడం మొదలెడితే దెబ్బలాటేగా!

అందుకే మారుమాట్లాడకుండా నేనే నోరు మూసుకుని పని చేసుకుంటూంటాను.

నిన్న సాయంకాలం బస్సులు పట్టుకుని చచ్చి, చెడి ఇంటికి వచ్చేసరికి అమ్మాయి సుధ కంప్లైంటు, హెూమ్‌వర్క్ చెయ్యలేదని వాళ్ళ టీచరు కొట్టిందట.

ఆ ముందు రోజు బస్‌స్టాండులో నుంచుంటే నాకు కావలసిన బస్సు తప్ప మిగతా అన్ని బస్సులూ వచ్చాయి. ఆఖరికి ఓ బస్సు నిండు చూలాలిగా నడవలేక నడవలేక ఊగుతూ వచ్చింది. దాని నిండుగా కూరుకుని జనం ఉన్నారు. పైగా బస్‌స్టాండులో ఉన్న ఏభై మందికి పైగా జనం దాని మీదికి ఎగబడ్డారు. రౌడీ మూకలు వేరే! గుమ్మం దగ్గిర నిలబడి వాళ్ళు పైకి వెళ్ళరు, మనని వెళ్ళనివ్వరు. వాళ్ళల్లో తోసుకుని కూరుకుంటూ ఎక్కగలిగిన సమర్థులు పదిమంది దాకా ఎక్కారు. మిగిలిన అంతా బస్‌స్టాండ్‌లోనే నిలబడిపోయాం. మరో బస్సు వచ్చేసరికి అరగంట పట్టింది. ఇల్లు చేరేసరికి రాత్రి ఏడున్నర.

ఇల్లు చేరేసరికి దిగాలుపడిన మొహాలతో పిల్లలు, శ్రీవారు ఎదురువచ్చారు.

"ఏం? ఇంత లేటు! ఓవర్ టైమా?" శ్రీవారి ప్రశ్న.

"అమ్మా ఆకలేస్తోంది. ఏమిటమ్మా ఇంత లేటు? టిఫిన్ చెయ్యవా?" అంటూ పిల్లల ఆత్రం.

నాకా కాళ్ళు పీకేస్తున్నాయి. తల పగిలిపోతోంది.




— ఆర్.ఎస్.హైమవతి

స్నానం చేసి వేడివేడిగా కాఫీ తాగి పడుకుంటే బాగుణ్ణని వుంది. కాని, అదెలా కుదురుతుంది? పని చెయ్యక తప్పదు. అందుకే విసుగొస్తుంది.

"ఏమండీ! మీరు ఆరు గంటలకే వచ్చేసి వుంటారు కదా! కాస్త ఏ బ్రెడ్డో, బిస్కట్లో కొని పిల్లలు, మీరు తిని పాలు కాచి వాళ్ళకిచ్చి మీరు కాఫీ కలిపి తాగకూడదూ? నేను వచ్చేదాకా ఆకలితో ఉండాలా?" అన్నాను.

"బాగుంది! నువ్వు లార్డ్‌లా లేటుగా రావడం కాక - వచ్చేసరికి నేను టిఫిన్లు, కాఫీలు ముగించలేదని సాధింపా? అసలే నెలాఖరు. బ్రెడ్‌లు, బిస్కట్లు ఊరికే వస్తాయా? నువ్వు సంపాదించేది కాస్తా ఈ ఖర్చులకే సరిపోయేలా వుంది" అంటూ దండకం ప్రారంభించారు.

"సరేలెండి. ఇవాల్టికి త్వరగా వంట చేసేస్తాను. ఏకంగా భోజనాలు చేసేద్దురు గాని" అన్నాను.

"అదెలా? నువ్వు స్నానం చేసి వంట చేసేసరికి ఎంత లేదన్నా మరో గంట గంటన్నర పైనే అవుతుంది. అంతసేపూ మమ్మల్ని ఆకలితో చావమంటావా? ఏ రవ్వ ఉప్మానో, అటుకుల ఉప్మానో త్వరగా అయ్యే టిఫిన్ చేసి మా ముఖాన పడెయ్యి. టి.వి. చూసి మెల్లిగా తొమ్మిది గంటలకి భోంచెయ్యచ్చు" అన్నారు.

ఇక తప్పలేదు మరి. ఆ రోజు రాత్రి పిల్లల చేత హోంవర్క్ చేయించడం కుదరలేదు. పోనీ ఆ పనేనా ఆయన చెయ్యచ్చుగా! అంటే అదీ లేదు. "ఆఫీసులో పని చేసి చేసి వచ్చి - మళ్ళీ ఈ పిల్లలతో నేను వేగలేను బాబూ! అదేదో నువ్వే చూసుకో!" అంటారు. నేను మాత్రం ఆఫీసులో పనిచేసిచేసి విసిగి రాలేదా? అబ్బే! అది ఆయనకి కనిపించదు. మొత్తానికి నిన్న హోంవర్క్ చెయ్యక పోయే సరికి పిల్లలు దెబ్బలు తిన్నారు.

ఆలోచిస్తూ వుండగానే టైమయి పోయింది. ఇక లేవక తప్పలేదు. పూర్వం పతివ్రతలు లేస్తూనే పతి పాదాలకి దండం పెట్టి లేచేవారట. అబ్బే! ఇప్పుడదంతా ఎక్కడ? పతిని తిట్టుకుంటూ లేవకపోతే ఆ రోజు పతి పూజ చేసినట్లే!

• • •

"చూడండి పిన్నిగారూ! నిన్న కూడా నాకు నీళ్ళు దొరకలేదు. నేను కాస్త ముందు పట్టుకొని వెళ్తాను. ఇంకా ఇంట్లో బోలెడు పని వుంది. ఆఫీసుకి లేటయిపోతుంది. అయ్యో! అలా దెబ్బలాడకండి పిన్నిగారూ! సరే! మీ ఇష్టం మీరే ముందు పట్టుకోండి. ఇందులో ఉద్యోగం చేస్తున్నానని నాకు గొప్ప ఏముంది? ఉన్న విషయం చెప్పాను."

ఊ! రెండు బిందెల నీళ్ళు అరగంట పైగా క్యూలో నిలబడి పట్టేసరికి తెల్లవారిపోతోంది. ఇక ఎప్పుడు బట్టలుతికి, స్నానం చేసి, వంట చేసి, అందరికీ పెట్టి కేరియర్లు సర్ది తాళాలు వేసుకుని బైటపడేది?

ఈ పిల్లలతో ఓ పెద్ద గొడవ. వాళ్ళంతట వాళ్ళు లేవరు. లేపి స్నానాలు చేయించి బట్టలిచ్చి హోంవర్కులు చేయించడం ఓ యజ్ఞమే!

మధ్యలో శ్రీవారి గొడవ. ఆయన నాకు సాయం చేయకపోగా - 'ఇదిగో సిరీ! ఇంకా కాఫీ అవలేదూ? గడ్డం చేసుకోడానికి వేన్నీళ్ళు పట్రా! నా పాంటు, షర్టు తీసిపెట్టవా? పిల్లల పేర్లో ఎల్.ఐ.సి. పాలసీలు తీసుకుంటున్నాను. ఆ ఫారాలు కొంచెం ఫిలప్ చేద్దూ!' అంటూ లేనిపోని వన్నీనూ నాకు అంటకట్టకపోతే అవన్నీ మీరే చూసుకోరాదూ! అంటే - 'మరి నిన్నెందుకోయ్ పెళ్ళి చేసుకున్నది?' అంటూ జవాబు.

ఏదో నన్నుద్ధరించడానికే ఆయన నన్ను పెళ్ళి చేసుకున్నట్లు ఆయన భావన.

• • •

"సారీ సార్! ఇవాళ ఓ పావుగంట లేటయింది. బస్సు దొరకలేదు సార్! ఏమిటమ్మా రోజూ ఇలా ఏదో సాకు చెప్తావ్! అంటారా సార్! సారీ సార్! రేపటి నించి ఇలా జరగనివ్వను సార్!" అంటూ ఎంత బ్రతిమాలినా ఆఫీసర్ చేత అక్షింతలు, అష్టోత్తరాలు, సహస్రాలూ తప్పడం లేదు. అవును మరి. ఆయననీ అనడానికి లేదు. రోజూ లేటుగా వచ్చి సారీ చెప్తూంటే నన్ను ఏమీ అనకుండా ఊరుకుంటే మిగిలిన వాళ్ళంతా కూడా అలాగే లేటుగా రావాలని వస్తారుగా! ఇప్పటికే మరి ఆఫీసులో చాలామంది 'ఆడవాళ్ళు లేటుగా వస్తే ఊరుకుంటారు. మరి మేము లేటుగా వస్తే ఎందుకు సార్ గొడవ చేస్తారు' అంటూ ఆఫీసరుని అడుగుతున్నారు.



కోడిగుడ్డుని వుడకపెట్టే నీటిలో కొద్దిగా ఉప్పు గడ్డలని కలిపితే వుడికాక పెంకును సులువుగా తీయవచ్చును.

ఎస్. విజయలక్ష్మి

పాప ఆయన ఏం చేస్తాడు మరి జుట్టు పీక్కోడం తప్ప. అందుకే ఆ కోపం ఈ కోపం మామీద చూపిస్తాడు.

• • •

ఇవాళ పాపకి జ్వరం. అయినా సెలవు పెట్టడానికి కుదరలేదు. మాత్ర వేసి పడుకోబెట్టి పక్కింటి మీనాక్షిని అప్పుడప్పుడు చూస్తూ వుండమని, అవసరమైతే ఫోను చెయ్యమని చెప్పి వచ్చాను. నా పుణ్యమా అంటూ ఆవిడ లీవ్‌లో వుంది. ఎలా వుందో ఏమిటో? జ్వరం ఎక్కువైతే పాపని మీనాక్షి డాక్టరు దగ్గరికి తీసుకెళ్ళిందో, లేదో! ఆవిడకు ఆవిడ పన్లు, పిల్లల పన్లు వుంటాయి కదా! అయినా మీనాక్షి ఆ మాత్రం సాయం చెయ్యకుండా వుండదు.

ఇలా వచ్చానో లేదో అప్పుడే ఆఫీసరు దగ్గర్నించీ పిలుపు. కొంపదీసి ఆలోచన్లలో పడి కాగితాలు తప్పు టైప్ చెయ్యలేదు కదా! అనుకున్నంతా అయింది.

"పొరపాటయింది సార్! మరోసారి ఇటువంటి తప్పులు చెయ్యను సార్! బ్రతిమాలి బైట పడేసరికీ తాతలు దిగివచ్చారు. మరిన్ని ఫైళ్ళూ దిగి వచ్చాయి. అవన్నీ టైప్ చేసి బయటపడేసరికి ఇవాళా లేట్‌లా వుంది.

ఇంట్లో పాపకి జ్వరం, లేటయినందుకు శ్రీవారి చేత అక్షింతలు తప్పవు.

• • •

"ఊ! నిన్న బస్సులు దొరకలేదన్నావు. ఇవాళ ఏం సాకు చెప్తావు?" అంటూ రాగానే నిలేశారు.

పిల్లని ఆ పరిస్థితిలో వదిలి వెళ్ళవలసి వచ్చినందుకు నా మనసు ఎంత ఘోషించిందో, ఆ ఆలోచనలతో బాధలతో నేను ఆఫీసులో తప్పులు చేసి ఆఫీసరు చేత ఎన్ని తిట్లు తిన్నానో చెప్తే ఈ మొరటు మనిషికి అర్థమవుతుందా? అన్నీ అతగాడికి కట్టు కథలుగానే కనిపిస్తాయి.

పూర్వకాలం చదువుకోని ఇల్లాలికి ఇంటి పనీ, పిల్లల పనీ తప్ప వేరే పని వుండేది కాదు. అయినా - ఆనాడు కొందరు పురుష పుంగవులు వారికి ఏమీ తెలియదని, వంటింటి కుందేళ్ళని, నూతిలోని కప్పలని రకరకాల బిరుదులిచ్చి వాళ్ళని అణగదొక్కడమే కాక మానసికంగా కూడా హింసించేవారు. పది పైసలు కావాలన్నా భర్తని అడగాల్సిన పరిస్థితి ఆనాటి స్త్రీది. పుట్టింటికి పోస్టుకార్డు రాయాలన్నా భర్తగారు తీసుకు రావాల్సిందే - రాశాక అతగాడు చదివి పోస్టుచెయ్యాల్సిందే! ఇలా ఎందుకు రాశావు? అలా ఎందుకు రాశావు? అంటూ సెన్సార్ చేసే పోస్టుకి వెళ్తుంది కాని, ఈమె గడప దాటి బైటకి వెళ్ళకూడదు.

ఆ పరిస్థితినించి బైటపడ్డారు ఈనాటి స్త్రీలు. అయితే - 'ఏ రాయయితేనేం పళ్ళూడగొట్టుకుందుకు' అన్నట్లు - ఇంటి పన్లు, పిల్లల పన్లకి తోడు ఆఫీసు పన్లు, బైట సరుకులు తెచ్చుకునే పన్లూ అన్నీ మరికాస్త పని ఎక్కువైంది. భర్త గార్లకి భార్యల సంపాదన కూడా ముట్టడంతో ఇంట్లో వసతులు, హోదాలూ మరింత పెంచుకుంటున్నారు. అంతేగాని సంపాదించిపెట్టే భార్యకి ఇంటి పన్లలో కాస్త సాయపడదాం అనే ఇంగితం ఏ కొద్ది మందికో గాని వుండటం లేదు. ఒక్కొక్కప్పుడు ఎందుకొచ్చిన బ్రతుకు? అనిపిస్తుంది. అయితేనేం? నాలో నాకే తృప్తి.

నా చిన్నప్పుడు ఒకసారి గాజులు కొనమని అడిగితే - వాకిట్లోకి గాజులబ్బాయి వస్తే అమ్మ పిలిచి గాజులు వేయించింది. నాన్న తిట్టి - గాజులు చేతి నుంచి తీసి ఆ అబ్బాయికి ఇచ్చేశాడు. మళ్ళీ అమ్మెప్పుడూ నాన్నని అడగందే గాజుల అబ్బాయిని పిలిచేది కాదు.

ఆ పరిస్థితి నా పిల్లలకి లేదు. నా పిల్లల అవసరాలు, నా అవసరాలు తీర్చుకోగలుగుతున్నాను. అంతో, ఇంతో ఆయనకి ఇంటి ఖర్చులో సాయపడుతున్నాను. ఆయన ఒక్క జీతంతోనే ఇంట్లో అందరి అవసరాలు, అన్ని ఖర్చులూ సర్దుకోవలసిన అవసరం లేదు. అందుకే మెల్లిమెల్లిగా ఇంట్లో అన్ని వస్తువులూ అమర్చుకుంటున్నాము. ఆయన గారికి విశ్వాసం, తృప్తి లేకపోతే పోనీ, నా మనసుకి తృప్తి వుంది. అంతే చాలు. ఆ తృప్తితోనే ఎన్ని కష్టాలనైనా నాలాంటి ఉద్యోగినులైన గృహిణులు ఎదుర్కొంటూ మనోధైర్యంతో ముందుకి పోగలరు, అనుకున్నాక మనస్సుకి ఏదో తెరిపి, కొంత ప్రశాంతత కలిగాయి.